ఉచిత వైద్య శిబిరం



మేడ్చల్: మున్సిపాలిటీ పరిధి అత్వెల్లిలో అల్ హస్మి హెల్త్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మజీద్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన శిబిరానికి స్థానికులు అధిక సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు బషీరుద్దీన్, నజాఫ్, యూసుఫ్, ఫీతర్, అబ్దుల్ ముకీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ ఆలయ చైర్మన్‌గా ప్రమోద్



మేడ్చల్: పట్టణంలోని తుమ్మ చెరువు కట్టపై ఆర్టీసీ కాలనీలోని కట్ట మైసమ్మ ఆలయ చైర్మన్‌గా ప్రమోద్ ఎన్నికయ్యారు. ఆదివారం ఆలయం వద్ద నిర్వహించిన కాలనీవాసుల సమావేశంలో ఆర్టీసీ కాలనీకి చెందిన ప్రమోద్‌ను ఆలయ చైర్మన్‌గా ఎన్నుకోగా.. చైర్మన్‌తో పాటు ఆలయ పాలకవర్గాన్ని నియమించుకున్నారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామని పాలకవర్గం సభ్యులు వివరించారు.

దివ్యాంగులకిచ్చిన హామీని అమలు చేయాలి

మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ తన మెనిఫెస్టోలో దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్‌ను ఇస్తామని చెప్పిన హామీని వెంటనే అమలు చేయాలని దివ్యాంగుల జేఏసీ వ్యవస్థాపకులు, సలహాదారులు నల్లా రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం నాచారం బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో నాచారం డివిజన్ దివ్యాంగుల జేఏసీ ఆవిర్భావ సభను నిర్వహించారు. సంస్థ నాయకులు బూడిద గణేష్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా నల్లారాధాకృష్ణ హాజరై మాట్లాడారు. ఆసర పెన్షన్లు పెంపునకు మందకృష్ణ మాదిగ అక్టోబర్‌లో వికలాంగుల గర్జన సభకు పూర్తి మద్దతూ ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనికి మద్దతుగా అక్టోబర్‌లో రెండో వారంలో దివ్యాంగులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. విజయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్‌గౌడ్, సాయిబాబా, ప్రమోద్‌కుమార్ మహారాజ్, గద్ద యుగేందర్, విద్దయ్య, నరేంద్రమోహన్, శ్రీనివాస్, రమేష్, దుర్గయ్య, కృష్ణ, ఫిరోజ్, వినోద్, గౌస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్వదినాలు మతసామరస్యానికి ప్రతీక

కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్ : గాంధీనగర్‌లోని ఉస్మాన్ బీన్ మసీదులో మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా ఆదివారం నిర్వహించిన అన్నదానం కార్యక్రమానికి కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. పర్వదినాలు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడలో పెద్ద మొత్తంలో డ్రగ్స్ తయారీ ఘటనపై సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నవోదయనగర్‌లోని షెడ్డు వద్ద నిరసన చేపట్టారు. ఇది ముమ్మాటికి పోలీసు నిఘా వైఫల్యమేనని ఆరోపించారు. ప్రభుత్వం దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం, కోమటి రవి, శ్రీనివాసులు, లక్ష్మణ్, వరప్రసాద్, జగ్గరాజు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, శరత్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డేంజర్ బెల్స్ !

శామీర్‌పేట్‌లో ప్రమాదకరంగా ప్రధాన చౌరస్తాలు



సిగ్నల్స్ లేకపోవడంతో ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనదారులు

- ప్రధాన కూడళ్లల్లో సిగ్నళ్లు లేక ప్రయాణికుల ఇక్కట్లు
- ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు
- సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ప్రజల విజ్ఞప్తి



నల్సార్ చౌరస్తా వద్ద...

శామీర్‌పేట్: ప్రమాదాలను నివారించాల్సిన సంబంధిత శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, అమాయకులైన ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని, ఉమ్మడి శామీర్‌పేట మండలాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

◆ కరీంనగర్ – హైదరాబాద్ రాజీవ్ రహదారిలో వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంగించి వాహనదారులు తమ వాహనాలను నిర్లక్ష్యంగా నడుపుతున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు వాదిస్తున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం కూడా కారణమని చెబుతున్నారు.

పని ఒత్తిడి.. ఇంటికి చేరుకోవాలని..

శామీర్‌పేట్ మండల పరిధిలోని రాజీవ్ రహదారి గుండా ఉన్న చౌరస్తాల్లో వాహనాలు అతివేగంగా నడుపుతూ.. ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఉద్యోగులు తమ విధులను పూర్తిచేసుకుని వస్తున్న తరుణంలో రాజీవ్ రహదారిపై పూర్తిగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు సంబంధితశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రయాణికుల సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేస్తే 1–2 రోజులు ట్రాఫిక్ పోలీసులను నియమించి అనంతరం తొలగిస్తున్నారు. దీంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సిన చౌరస్తాలు..

ఉమ్మడి శామీర్‌పేట్ మండలంలోని అలియాబాద్ చౌరస్తా, మజీద్‌పూర్, నల్సార్ యూనివర్సిటీ చౌరస్తా, దొంగల మైసమ్మ చౌరస్తా, తూంకుంట చౌరస్తాల్లో ప్రధానంగా ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రమాదాలను అరికట్టేందుకు ఈ చౌరస్తాల్లో సిగ్నల్స్, స్పీడ్ బ్రేకర్లతో పాటు ట్రాఫిక్ పోలీసులను నియమిస్తే ప్రమాదాలను అరికట్టడంతో పాటు ట్రాఫిక్ సమస్యను నియంత్రించవచ్చు.

ప్రతిపాదనలకే పరిమితం..

ట్రాఫిక్ సమస్యలపై స్థానిక నేతలు, ప్రయాణికులు పలుమార్లు ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గతంలో ట్రాఫిక్ అధికారులు ప్రతిపాదనలు సైతం సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించామని చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఏ ఒక్క చౌరస్తాలో సిగ్నల్స్ ఏర్పాటు చేయలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సిగ్నల్స్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

భయం.. భయంగా రోడ్డు దాటుతున్నాం



రాజీవ్ రహదారిని దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డును దాటుతున్నాం. మా గ్రామానికి వెళ్లాలంటే కరీంనగర్ – హైదరాబాద్ రాజీవ్ రహదారిలోని అలియాబాద్ చౌరస్తానే దాటాలి. ఫార్మా కంపెనీల వల్ల ఈ రోడ్డులో వాహనాల రాకపోకలు కూడా అధికమయ్యాయి. దీంతో ఈ రోడ్డు రద్దీగా ఉండటమే కాకుండా నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసి, ప్రమాదాలను నివారించాలి.

– నందుగౌడ్, అలియాబాద్

ప్రమాదాలపై అధికారులు దృష్టి సారించాలి



ఉమ్మడి శామీర్‌పేట్ మండలంలోని పది గ్రామాల ప్రజలు చదువు, ఉద్యోగంతో పాటు వివిధ పనుల నిమిత్తం ఈ చౌరస్తాల మీదుగా నగరానికి వెళ్తుంటారు. వీరంతా ట్రాఫిక్ సిగ్నల్స్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు ప్రమాదాల భారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలి.

– నాగరాజు, మాజీ ఎంపీటీసీ, లక్ష్మాపూర్

ఆలయాల మూసివేత



చీర్యాల లక్ష్మీనృసింహ ఆలయ ప్రధాన ద్వారం



కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయం

కీసర: చంద్రగ్రహణం వల్ల కీసర మండలం పరిధిలోని పలు ఆలయాలను మూసివేశారు. చీర్యాలలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సోమవారం ఉదయం 4 గంటల వరకు ఆలయాన్ని మూసివేస్తున్నామని నిర్వాహకులు ప్రకటించారు. కీసర రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సైతం మూసివేసినట్లు ముందే ప్రకటించిన విషయం తెలిసిందే.

డ్రగ్స్ మాఫియాపై మరింత కఠినంగా వ్యవహరించాలి



నిరసన చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

మేడ్చల్: దేశవ్యాప్తంగా రెచ్చిపోతున్న డ్రగ్స్ మాఫియాపై మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశాడు. ఆదివారం డ్రగ్స్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా డ్రగ్స్ ఎక్కడ దొరికినా.. మూలాలు హైదరాబాద్‌లో ఉంటున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాఫియాపై మరింత కఠినంగా వ్యవహరించి నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. అధికారులు ఉదాసీనత వైఖరి వీడి చర్లపల్లి ఘటనలు మరోసారి చోటుచేసుకోకుండా చూడాలన్నారు. నాయకులు జ్యోతి, అంజలి, నర్సింగ్‌రావు, రంజిత్‌రెడ్డి, గౌస్, చంద్రశేఖర్, అక్షయ, బాలు, నర్సింహ్మ తదితరులున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు విటమిన్ ట్యాబ్లెట్లు



పంపిణీ చేస్తున్న మాజీ కౌన్సిలర్ హరిప్రసాదరావు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో మాజీ కౌన్సిలర్ బెజ్జంకి హరిప్రసాదరావు ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కల పెంపకంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు విటమిన్ ట్యాబ్లెట్లను పంపిణీ చేశారు.

రెడ్డి సంఘం భవనానికి స్థలం కేటాయించేందుకు కృషి




ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్: రెడ్డి సంఘం భవనం నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్ ఎస్ఎల్ఎన్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన రెడ్డి సంఘం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఘట్‌కేసర్ రెడ్డి సంఘానికి ఘనమైన చరిత్ర ఉందన్నారు. నూతన అధ్యక్షుడు చందుపట్ల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి సంఘం అభివృద్ధికి సభ్యులందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి కో–ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవాలని, ప్రమాదవశాత్తు మరణించిన రెడ్డిలకు బీమా అందజేసేందుకు ప్రయత్నించాలని పలువురు సభ్యులు సూచించారు. మాజీ మేయర్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, సంఘం మాజీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, రాఘవరెడ్డి, సంఘం ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బడుగులు ఆశాజ్యోతి అంబేడ్కర్



ఘట్‌కేసర్: బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గోపుబాలరాజుయాదవ్, మండల అధ్యక్షుడు మేడబోయిన సంజీవముదిరాజ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. బడుగులు అనుభవిస్తున్న స్వేచ్ఛ, సమానత్వం కోసం ఆయన అలుపెరగని పోరాటం చేసి సమానత్వం తెచ్చిపెట్టారన్నారు. దాసు, పరమేష్, సదానంద్, శ్రీనివాస్, నర్సింగ్‌రావు, రాందాసు, రవి, అంజయ్య, శ్రీరామ్, కృష్ణంరాజు, విష్ణు, ప్రవీణ్, అఖిల్, లలిత్ పాల్గొన్నారు.

పౌర సేవల్లో జాప్యం !

సిబ్బంది కొరత.. నామమాత్రంగా వార్డు ఆఫీసర్లు

- పరిశీలనకే పరిమితమైన ధ్రువీకరణ పత్రాలు
- మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 34 పురపాలికలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: పురపాలిక సంఘాల్లో సిబ్బంది కొరతతో పురసేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించినప్పటికీ, 'ఎక్కడ వేసిన గొంగడి.. అక్కడే' అన్న చందంగా ఉంది. ఫలితంగా సిటిజన్ చార్టు అమలునకు నోచుకోవటం లేదనే విమర్శలను ఎదుర్కొంటోంది. కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే పుర వ్యవహారం నడుస్తుండటంతో వార్డు అధికారుల పాత్ర నామమాత్రమవుతోందనే ఆరోపణలున్నాయి.

అదనపు భారం పడకుండా..

పురపాలికల్లో ఆదాయ వనరులను పెంచేందుకు తగిన వ్యూహంతో ముందుకుసాగాల్సిన అధికార యంత్రాంగం లేఅవుట్లు, ఇళ్లు, బహుళ అంతస్తుల భవన నిర్మాణాల అనుమతులకు దొడ్డి దారిన సంపాదించే అక్రమార్జనపై చూపినంత శ్రద్ధను పలువురు పుర అధికారులు.. ప్రభుత్వానికి సమకూర్చాల్సిన ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించటం లేదని విమర్శలు ఎదురవుతున్నాయి.

◆ పురపాలక సంఘాల్లో వార్డు అధికారులకు ఇటీవల ఉన్నతాధికారులు అప్పగించిన జనన, మరణ ధ్రువీకరణ పత్రాల పరిశీలన బాధ్యతలను చూడాల్సి ఉన్నప్పటికీ.. ఆయా కమిషనర్ల చర్యలకు అనుగుణంగా విధులను నిర్వహించాల్సి వస్తోంది. దీంతో వార్డు అధికారులు తమకు అప్పగించిన పనులను నామమాత్రంగా మాత్రమే చేపడుతున్నట్లు తెలుస్తోంది.

◆ మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 34 పురపాలికల్లో వార్డు అధికారుల



ప్రమేయం కొంతమేరే ఉంటోంది. వార్డు అధికారులు అన్ని పనుల్లో కీలకపాత్ర పోషించాల్సి ఉన్నప్పటికీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లో విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలను ఎదుర్కొంటున్నారు.

పత్రాల జారీలోనూ జాప్యమే..

పురపాలక సంఘాల నుంచి ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. సంబంధిత పత్రాలు సకాలంలో జారీ కాకపోవడంతో ఆఫీసుల్లో కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. దీంతో సంబంధిత కార్యాలయాల చుట్టూ.. ప్రజలు తిరగాల్సి వస్తోంది. సాధారణంగా నగరాలు/ పట్టణాల్లో ఇటీవల జనన, మరణ ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు అధికంగా వస్తున్నాయి. దీనికితోడు పురపాలికల్లో కొనసాగుతున్న ప్రత్యేక పాలన నేపథ్యంలో ధ్రువపత్రాల జారీలో తీవ్ర జాప్యం నెలకొనడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

అనుమతులకు పడరాని పాట్లు..

ఇంటి నెంబర్లు, మ్యూటేషన్లు నల్లా అనుమతులు పొందడానికి కూడా స్థానిక ప్రజలు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. ఎంతో కొంత సమర్పించుకుంటేనే గానీ పనులు ముందుకుసాగడం లేదని, లేనిపక్షంలో సరైన పత్రాలు లేవన్న కారణాలతో కొర్రీలు పెడుతూ.. మరింత జాప్యం చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

ఇంటినెంబర్లలో కూడా..

పురపాలక సంఘాల్లో అన్ని అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇంటినెంబర్లు కేటాయించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్న ఆరోపణలు ఆయా పట్టణాల ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఇంటి నంబరు సకాలంలో కేటాయించని పలువురు పుర అధికారులు ఏళ్ల తరబడి భవనాలు నిర్మించుకుని విద్యాసంస్థలు, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు, ఓయో పేరుతో చర్యలకు పాల్పడుతున్న వారిపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శిస్తున్నారు.

ఏళ్లతరబడి వదిలేసిన వైనం..

పురపాలక సంఘాల్లో ఏళ్ల తరబడి ఇళ్లు ,బహుళ అంతస్తులు నిర్మించుకుని, ఇంటి నెంబర్లు పొందకుండానే విద్యాసంస్థలు, వివిధ రకాల వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నప్పటికీ పుర కమిషనర్లు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. కొత్త ట్రేడ్ లైసెన్సు జారీ, రెన్యూవల్ విషయాల్లో కూడా పుర అధికారుల ఉదాసీనత, ఆదాయ వనరుల పెంపునకు విఘాతం కలిగిస్తోందని ప్రజలు పేర్కొంటున్నారు. వీటిపై ఆయా జిల్లాల అధికార యంత్రాంగం దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

ముగిసిన నిమజ్జనం.. లడ్డూవేలం



దేవేందర్‌నగర్‌లో లడ్డూను దక్కించుకున్న సోహెల్

మేడ్చల్: ఎల్లంపేట్, మేడ్చల్ మున్సిపాలిటీల్లో గణపతి నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. శనివారం ప్రారంభమైన నిమజ్జనోత్సవాలు ఆదివారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి. మేడ్చల్ ప్రాంతంలో రాత్రి సమయాల్లో నిమజ్జనాలు చేయడం అనవాయితీ ఉండటంతో శనివారం రాత్రి మండపాల్లో పూజలు ప్రారంభించి కాలనీలలో ఊరేగించి అర్ధరాత్రి తర్వాత చెరువులకు తరలించారు.

◆ మేడ్చల్ పెద్ద చెరువు, సుతారిగూడ చెరువు, ఆయా గ్రామాల చెరువుల వద్ద మున్సిపల్, రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, విద్యుత్ తదితర శాఖల అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయడంతో నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలో ప్రధాన మార్కెట్‌లో మేడ్చల్ గణేష్ ఉత్సవ సమితి వినాయక ఊరేగింపులకు స్వాగతం పలికింది.

◆ అత్వెల్లి వినాయక మండపం అడ్డూ వేలంలో రూ.2 లక్షలు పలికింది. ఎంఆర్ఆర్ కాలనీలో రూ. 3,35,000లు పలికింది. వివిధ కాలనీలలో లడ్డూ వేలం పాటలు జోరుగా సాగాయి.

వెల్లివిరిసిన మతసామరస్యం..

జవహర్‌నగర్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్‌నగర్‌లో మతసామరస్యం గొప్పగా ప్రతిబింబించింది. గణేష్ ఉత్సవాల్లో భాగంగా దేవేందర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం వద్ద రాత్రివేళ వేలం పాట నిర్వహించగా.. స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక ముస్లిం యువకుడు ఎండీ సోహెల్ పాల్గొని రూ.50 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

◆ 12వ డివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీ పోచమ్మ ఆలయం వద్ద గణేష్ లడ్డూ వేలంపాట జరిగింది. ఈ వేలంలో మాజీ మేయర్ శాంతికోటేష్‌గౌడ్ పాల్గొని రూ.53,600లకు లడ్డూను కైవసం చేసుకున్నారు.

కీసరలో..

ఎస్‌జేఆర్ గణేష్ ఉత్సవ కమిటీ, భోజనపల్లి సుందరాచార్యుల ఆధ్వర్యంలో లడ్డూ వేలంలో చంద్రశేఖర్‌లలిత దంపతులు లడ్డూను రూ.2,00,001కు కైవసం చేసుకున్నారు.



లడ్డూతో మాజీ మేయర్ శాంతి



గణనాథుడి నిమజ్జనానికి తరలివెళ్లిన మహిళలు



లడ్డూను కైవసం చేసుకున్న కుటుంబం



కీసర భోజన్‌పల్లిలో రంగు చంద్రశేఖర్‌లలిత దంపతులు